# కాగితం పడవలు

## డి.ఎ. సుబ్రహ్మణ్యశర్మ

ముందు కొంగి సైకిల్ తొక్కుతున్నాడా వ్యక్తి.

వయసు గడిచిన ఛాయలు మొహం మీద కన్పిస్తున్నాయి.

జుట్టు పైకి దువ్వుకొన్నాడేమో – నుదురు విశాలంగా కన్పిస్తోంది.

ముక్కు మీద తమాషాగా ఆనిన కళ్ళజోళ్ళోంచి చురుగ్గా చూస్తున్నాయి కళ్ళు. రోడ్డు ఎత్తుగా ఉందేమో – మూతి బిగబట్టి తొక్కుతున్నాడు.

ఇతను రాఘవ కాదు కదా? –

కిటికీలోంచి చూస్తున్న రమ్య అనుకొంది.

ఎదురుగా కూర్చుని వున్న దివ్య – తల్లిని గమనిస్తూనే వుంది.

"ఆయన మా కొత్త లెక్చరర్" అంది.

తనని గమనిస్తోందన్న మాట!

"మా కాలేజీకి కొత్తగా ట్రాన్స్‌ఫరయి వచ్చారు. ఇంగ్లీషు చెప్తారు" మరికొన్ని వివరాల్ని అందజేసింది.

"పేరు?"

"రాఘవగారు. చాలా బాగా చెప్తారు."

"అహా –" అంది గాలిలో ఎగురుతూన్న తల వెంట్రుకల్ని పైకి తోసుకుంటూ.

రాఘవేనన్నమాట!

క్రితం రోజు కూడా సైకిల్ మీద వెళ్తూ కనిపించాడు. అప్పుడే తన కనిపించింది – అతను రాఘవేనని. కానీ – మనిషిని పోలిన మనుషులుండొచ్చు కదా – అని సరిపెట్టుకొంది.

ఎంతగా మారిపోయాడు!

అప్పట్లో రాఘవ ఎంత అందంగా ఉండేవాడని! వంకీలు తిరిగిన నల్లని జుత్తుతోనూ, మిలమిల మెరిసే కళ్ళతోనూ, చక్కని ముఖకవళికలతోనూ, ఎవరన్నాసరే – ఇట్టే ఆకర్షించుకొనే వాడు!

కానీ – ఇప్పుడో?! – మనిషి సన్నబడ్డాడు. జుట్టు పల్చబడింది. మొహంలో కాంతీ తగ్గింది. అప్పటికీ ఇప్పటికీ పోలికే లేదు! పైగా ఆ కళ్ళజోడొకటి! ఫ్రెంచి ఫిలాసఫర్ లాగ!

కాలం మనిషిలో ఎంతటి మార్పుని తెస్తుంది!

ఎదురుగుండా అద్దంలో తన ప్రతిరూపం కనపడుతోంది....

తను మాత్రం పూర్వానికి మల్లేనే వుందా? మార్పు రాలేదూ?–

ఆ కళ్ళలో పూర్వపు కాంతి ఉందా? తుమ్మెద రెక్కలకి మల్లే నల్లగా నిగనిగలాడే తన జుట్టు మధ్య మధ్యలో నెరిసిపోలేదూ? తన వొంటి మిస మిస, చెక్కిళ్ళ నునుపుదనం, పెదాల ఎరుపుదనం, ఇంకా అలానే ఉన్నాయా? కాలం – తనలో కూడా మార్పులు తీసుకురాలేదూ?...

విశాఖ సముద్రతీరంలో –రాఘవ తన కెదురుగా ప్రేమ పూజారికి మల్లే నిలబడి– తన అందచందాల్ని కావ్య పరిభాషలో పొగుడుతూంటే – తనెంతగా మురిసిపోయేదని!

ఇప్పుడు కనుక – రాఘవ తనని చూస్తే – బావురుమని పోడూ?...

దివ్య అద్దం ముందు నిలబడి – బొట్టు సరి చేసుకొంటోంది. మధ్య మధ్యలో పమిట సరి చేసుకొంటోంది. యవ్వన ప్రాంగణంలోకి నూతనంగా ప్రవేశించిన హుషారు ఆ సవరింపులో కనపడుతోంది.

"కాలేజీకి టైమయిపోతోంది. వెళ్ళొస్తానమ్మా –" పుస్తకాలు చేతిలోకి తీసుకొంటూ అంది.

"సరేనమ్మా–"

★ ★ ★ ★

కదిపిన తేనె పట్టులోని తేనె టీగలకి మల్లే ఏవేవో జ్ఞాపకాలు...

తనూ రాఘవా సముద్ర తీరంలో కూచుని – చెప్పుకున్న మాటలూ, చేసుకొన్న బాసలూ, అన్నీ ఒకొటొకటిగా గుర్తుకొస్తున్నాయి....

తనని కలుసుకోలేక పోతే రాఘవ పిచ్చెక్కి పోయేవాడు! అతణ్ణి చూడకపోతే తను వెఱ్ఱెక్కి పోయేది! తను అతనితో కలిసి అక్కడా, ఇక్కడా, మరో చోటా, కనిపించడంతో – కాకుల్లాంటి లోకులకి కావలసినంత మేత దొరికింది. తమ ప్రేమ వ్యవహారం గురించి ప్రతి ఒక్కరూ చెప్పుకోవడం మొదలు పెట్టేరు. తమ పేర్లు గోడల మీద కెక్కనే ఎక్కాయి! కాలేజీలో ప్రతి ఒక్క స్టూడెంట్‌కీ తమతో మాటాడాలని కుతూహలమే! లెక్చరర్స్‌కి మరీను! స్టూడెంట్స్‌ని పిలిచి మరీ తమ ప్రేమ వ్యవహారం గురించి భోగట్టా చేసేవారు

ఆ సమయంలో తనూ, రాఘవా, ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న మనుషులకి మల్లే ప్రవర్తించారు! జరుగుతున్నదేమిటో, జరగబోయేదేమిటో, అంతుపట్టని స్థితి అది.

కొనకొక నిర్ణయాని కొచ్చారు. ఎలాగైనా పెళ్ళి చేసుకోవాలని.

కానీ – ఎలా? ఏ విధంగా?? లాంటి ప్రశ్నలకి మాత్రం సులభంగా జవాబులు దొరికేవి కావు!

తమ వివాహం విషయం – తమ తల్లిదండ్రులతో – ధైర్యంగా ప్రస్తావించాలనుకొన్నారు. రాఘవ – ఎలాగైతేనేం – తన తల్లిదండ్రులని – తమ వివాహానికి – వొప్పించగలిగాడు. తనూ – తన తల్లిని వొప్పించగలిగింది. కానీ తండ్రి దగ్గరికొచ్చే సరికి మాత్రం అడ్డుకట్ట పడింది! తనొక పేరు మోసిన లాయర్. తన క్కాబోయే అల్లుడు తన అంతస్తుకి తగ్గ వాడై వుండాలి. అంతే కానీ – ఒక ఎలిమెంటరీ స్కూల్ టీచర్ కొడుక్కి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తాడా? నో! నెవ్వర్!! తన కంఠంలో ప్రాణం ఉండగా అది జరిగేది కాదని చెప్పేవాడు.

వార్ ఫుటింగ్ మీద తన హోదాకి తగ్గ సంబంధాల కోసం గాలించడం మొదలు పెట్టాడు.

తన తండ్రొక రాక్షసుడు! అనుకొన్నంత పనీ చేస్తాడు. తన నెవరికో ఇచ్చి కట్ట బెడతాడు. అదే కనుక జరిగితే – తను బతగ్గలదా? పోనీ – రాఘవని కలుసుకొందాం అంతే – ఇంటి నుంచి బయటికి వెళ్ళడానికి వీల్లేకుండా కట్టడి చేశాడు. రాఘవ తన ఇంటి దరిదాపుల్లోకి రాకుండా రౌడీల్ని కాపలా పెట్టేడు. పెళ్ళి గురించి మాటాడ్డాని కొచ్చిన రాఘవ తండ్రిని ఇన్సల్ట్ చేసి పంపించాడు.

తన గతేం కాను? తమ ప్రేమ కథా... అన్ని ప్రేమ కథలకి మల్లే విషాదాంతం కావలసిందేనా??

రాఘవేమయినట్టు? అతణ్ణి గురించిన సమాచారమే తెలియటం లేదు.

మరికొద్ది రోజులకే పెళ్ళి సంబంధం కుదుర్చుకొచ్చాడు – తండ్రి.

తనకాపెళ్ళొద్దని ఎంత మొర పెట్టుకొన్నా లాభం

లేకపోయింది.

ఒక దుర్ముహూర్తాన్ని – ఒక ఇంజనీరు చేత తన మెడలో తాళి కట్టించేశాడు.

పెళ్ళాం అనే దాని కోసం అవురావురని పోయిన ఆ రెండో పెళ్ళాయన – ఇలా పెళ్ళవటంతోనే అలా తనని తీసుకుపోయాడు.

ఆ మానవుడితో పదేళ్ళ పాటు నిర్వికారంగా నిర్లిప్తంగా కాపురం చేసింది.

దివ్య పుట్టాక- తన జీవితాని కొక ధ్యేయం ఏర్పడుతున్న సమయంలో – తన భర్త ఒక రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అప్పట్నించీ తనే తల్లీ తండ్రి అయి దివ్యని పెంచి పెద్ద చేసింది.

తన జీవితంలో వచ్చిన ఒడిదుడుకుల్ని దృష్టిలో పెట్టుకొని- దివ్య జీవితాన్ని తీర్చి దిద్దటానికి ప్రయత్నం చేస్తోంది.

మరి రాఘవ సంగతి?

అతను గుర్తొచ్చినప్పుడల్లా గుండె తరుక్కుపోతూ ఉంటుంది!

అతనేమయి పోయాడో?... ఎక్కడున్నాడో?... ఏం చేస్తున్నాడో?... తన మూలంగా అతని జీవితం నాశనం అయిపోయిందో... ఏమిటో...

రాఘవని గురించిన ఆలోచనలతో మనస్సు వికలం అయిపోతూంటుంది!

మళ్ళీ ఇన్నాళ్ళకు కనబడ్డాడు!

క్షేమంగా ఉన్నాడు!

అంతే చాలు!

"దివ్య ఉందాండీ?"

"ఎవరూ?"

"నేనండి- సునీల్‌ని" లోపలికి ప్రవేశిస్తూ అన్నాడు.

సునీల్ ఎమ్. బి. బి. యస్. ఫైనలియర్ చదువుతున్నాడు. పక్కింట్లో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు.

"కాలేజీకి వెళ్ళింది నాయనా..."

"సరేనండి. మళ్ళీ వస్తాను."

వెళ్ళిపోతున్నాడతను.

"ఏదైనా చెప్పమంటావా సునీల్?"

"అబ్బే- ఏం లేదండి. సాయంత్రం వస్తానని చెప్పండి" వెనక్కి తిరిగి చెప్పాడు.

"సరే నాయనా."

మెట్లు దిగి కాలి దారమ్మటే గేటు వేపుకి నడుస్తున్నాడు. అతని మాటలో, నడకలో, ప్రవర్తనలో, ఒక విధమైన హుందాతనం కనిపిస్తూంటుంది. దివ్యకి తగ్గ ఈడు జోడూ- అనుకొంది రమ్య.

* * * * * *

గేటు దగ్గిర నిలబడి "రాఘవా" అని పిలిచింది.

రాఘవ తనకేసి చూశాడు. కంగారెత్తి పోయాడు!!

రమ్యేనా?! తనని పిలుస్తున్నది రమ్యేనా?! ఎదురుగా నిల్చుని తనని లోపలికి రమ్మనమని పిలుస్తున్నది- తన రమ్యేనా?!!!

అందరి కళ్ళ లాంటి కళ్ళు కావు రాఘవవి. అవి మాటాడతాయి! వాటి విషయం తనకి బాగా తెలుసు.

సడన్ బ్రేక్ చేసి- దిగటంతో – కిందకి పడినంత పని చేశాడు!

"లోపలికిరా రాఘవా...." అంది తను – నవ్వుతూ.

"ఈ ఇల్లు?!...." సంభాషణ ఎలా మొదలు పెట్టాలో తెలియక తికమక పడుతున్నాడు.

"ఈ ఇల్లు మాదే- నీ కోసమనే ఇక్కడ నుంచున్నాను. లోపలికి రా...." అంది తను. ఆశ్చర్యానందాల్లో మునిగి తేలిపోతున్నాడు! ఏదొచ్చినా పట్టలేదు! అతని మనస్తత్వం తనకి బాగా తెలుసు.

సన్నటి దారమ్మట చెట్ల మధ్య లోంచి నడిచి వస్తూంటే- తన వైపే ఆరాధనగా చూస్తున్నాడు. ఏవిటేవిటో మాట్లాడు దామను కొంటున్నాడు కానీ- అంతలోనే ఆగి పోతున్నాడు.

రాఘవని సోఫాలో కూచో బెట్టింది. టిఫినూ కాఫీ ఇచ్చింది.

ఆ తర్వాత అతని కెదురుగా వున్న సోఫాలో కూచుంటూ "బాగున్నావా రాఘవా?" అంది.

రాఘవ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

కొన్ని సేపయాక "ఇదిగో ఇలా వున్నాను" అన్నాడు.

వేవేసినట్టయి పోయింది తన మనస్సు! కళ్ళ లోంచి నీళ్ళు కారుతున్నాయి.

మళ్ళీ అతనే అడిగాడు "నువ్వెలాగున్నావ్?"

గుండె గొంతుకలో కొట్టాడినట్లని పించింది. తనేమని చెబుతుంది? బాగున్నానని చెబుతుందా? బాగా లేదని చెబుతుందా?...

"ఏదో – ఫర్వాలేదు" అంది ఆఖరికి.

రాఘవ తన ముఖం కేసే చూస్తున్నాడు.

అతని కళ్ళల్లో ఏదో ఆవేదన!

"నీ భర్త?..." ఏదో అడగబోయి అంతలోనే ఆగిపోయాడు.

"ఆయన పోయారు. దివ్యా – నేనూ – మిగిలాం" గద్గద స్వరంతో అంది.

"దివ్య అంటే మీ అమ్మాయేనా?"

"అవును. మీ కాలేజీలోనే బి. ఏ. సెకండియర్ చదువుతోంది. అదే నీ గురించి చెప్పింది."

"అలాగా?"

ఆ తర్వాత – ఎంత సేపు మాటాడుకొన్నారో తెలియదు!

దివ్య తన ఫ్రెండ్సుతో పిక్చర్‌కి వెళ్ళింది. కనుక – ఎవరి ఆటంకమూ లేదు.

తను అతను చెబుతున్నది వింటోంది....

అతను తను చెబుతున్నది వింటున్నాడు...

తమ వీధి కొసలో నున్న ఇంట్లో ఉంటున్నాట్ట.

తన నెలాగయినా కలుసుకొందామని ప్రయత్నించి – రౌడీల చేత తన్నులు తిన్నాట్ట. తనకి పెళ్ళయిన చాలా కాలం దాకా – తనెక్కడయినా కనబడుతుందేమోనన్న వెర్రి ఆశతో – దేశదిమ్మరికి మల్లే వూరూరూ తిరిగాట్ట. రాను రాను ఒక వేదాంత ధోరణి లాంటిది అలవడటంతో – మామూలు మనిషయ్యాట్ట. ఎమ్. ఏ. పాసయి – లెక్చరర్‌గా జీవితంలో స్థిరపడినప్పటికీ – మనసుకి తగిలిన గాయం ఇంకా రగులుతూనే ఉండటంతో – వివాహం మాత్రం చేసుకోలేదట. వొంటరివాడిగానే మిగిలిపోయాట్ట.

ఒకరి బాధలు మరొకరికి చెప్పుకోవటంతో –



మనసులు తేలిక పడ్డాయి!
తనని కలుసుకోవడం మూలంగా రాఘవ ఎంతగా ఆనందించాడో – అతని ముఖం చూస్తేనే తెలుస్తోంది

రాఘవ వెళ్ళేప్పటికి తొమ్మిది గంటలవుతోంది

★ ★ ★ ★

దివ్య ఏ రోజూ కూడా రాఘవ గురించి చెప్పకుండా ఉండదు! డ్రామా ఆయన చెప్పినట్టుగా మరెవరూ చెప్పలేరట!

'రోమియో అండ్ జూలియట్'' నాటకంలోని పాత్రల గురించి, వాటి మనస్తత్వాల గురించీ, విది చేసే విన్యాసాల గురించీ వివరించి చెబుతూ ఆయన చేసే కామెంట్స్‌ని విని తీరాలట! రోమియో జూలియట్‌లు కలుసుకొన్న దృశ్యాల్ని వివరిస్తున్నప్పుడు ప్రేమికుల హృదయాలకి ఆయన అద్దం పట్టేరా అన్నట్టుంటుందిట! 'వాట్ ఈజ్ ఇన్ ఎ నేమ్' అనే పాసేజీని ఆయన వివరించి చెప్పిన తీరు నిజంగా అద్భుతంట! షేక్స్పియర్ మహాకవి గొప్పతనం గురించీ ఆయన నాటకాల ప్రాశస్త్యాన్ని గురించి చెబుతూంటే – రాఘవ గారెంతటి గొప్ప పండితుడు! అనిపిస్తుందిట స్టూడెంట్స్ ఎవళ్ళ క్లాసయినా పోగొట్టుకొంటారు గానీ ఆయన క్లాసు మాత్రం పోగొట్టుకోరట! అందరి స్టూడెంట్స్‌కీ ఆయన ఫేవరిట్ లెక్చరరయిపోయాట్ట!

రాఘవని గురించిన స్తోత్రాలు వినటానికి తనకీ ఆనందంగానే వుంది గానీ – అతణ్ణి గురించి దివ్య దృక్పథం ముందు ముందెలా మారుతుందోనన్నదే – రమ్య బయం

దివ్య తన బర్త్‌డే పార్టీకి రాఘవని ఆహ్వానించింది!

తన ఆహ్వానాన్ని మన్నించి రాఘవ వచ్చినందుకు – ఉబ్బి తబ్బిబ్బయిపోయింది! దివ్య రాఘవని తన దగ్గరికి తీసుకొచ్చి పరిచయం చేస్తున్నప్పుడూ – రాఘవ ఒక కొత్త వ్యక్తిని కలుసుకొంటున్నట్టుగా చేతులు జోడించి నమస్కారమండీ అంటున్నప్పుడూ – రమ్య కొద్దిగా కంగారు పడకపోలేదు

అయినా తన కంగారుని కనబడనీయకండా నమస్కారమండీ – మా దివ్య ఎప్పుడూ మీగురించే చెబుతూంటుంది అంది

ఆ తర్వాత దివ్య రాఘవకి - సునీల్‌ని తన ఫ్రెండ్‌గా పరిచయం చేసింది

రాఘవ సునీల్ కేసి ఆప్యాయతగా చూశాడు

ఆ రోజు పార్టీలో రాఘవ దివ్యకి బర్త్‌డే గ్రీటింగ్స్ తెలుపుతూ– చక్కని ఉపన్యాసాన్నిచ్చాడు

పూర్వపు హుషారును రాఘవలో తిరిగి చూడగలిగింది– రమ్య

మొత్తానికారోజు చాలా ఆనందంగా గడిచిపోయింది!

మరో రెండు రోజులకి – సునీల్ తల్లి దండ్రులొచ్చారు

దివ్య చాలా తెలివైనది!

ఆమె సునీల్‌తో స్నేహం చేస్తోంది ఎందుకంటే – అతను యోగ్యుడూ, మంచివాడూ, కనుక

స్నేహం చేస్తోందని చెప్పి – అతనికి మరీ చనువివ్వదు ఎందుకంటే – అలా చెయ్యడం తనకే ముప్పు కనుక

సునీల్‌తో పెళ్ళి ముందు– ప్రేమ తర్వాత– అని స్పష్టంగా చెప్పేసింది ఎందుకంటే –




జారుడు మెట్ల మీద నడవటం ఆడదానికి క్షేమం కాదు కనుక

సునీల్‌కి కూడా దివ్య చెప్పింది సబబుగానే అనిపించింది

అందుకే – తన తల్లిదండ్రుల్ని రప్పించాడు దివ్యతో తన వివాహానికి వారిని వొప్పించాడు!

వాళ్ళకి దివ్య నచ్చింది!

అందుకే – వాళ్ళే రమ్యని అభ్యర్థించేరు – ఆమె కభ్యంతరం లేకపోతే–

దివ్యని తమ కోడలిగా చేసుకొంటామని

సంతోషంగా వొప్పుకొంది –రమ్య

తొందర్లోనే ముహూర్తం నిర్ణయించి కబురు పెడతామన్నారు

వాళ్ళు వెళ్ళాక అనుకొంది 'దివ్య ఎంత అదృష్టవంతురాలు!' అని

రాఘవని కాలవగట్టు దగ్గిర కలిసినప్పుడు – దివ్య పెళ్ళి గురించి చెప్పింది

రాఘవ ఎంతగానో ఆనందించాడు!

పెళ్ళికి నేనేం చెయ్యాలో చెప్పు అన్నాడు

నువ్వేం చెయ్యనక్కర్లేదు పెళ్ళికొస్తే చాలు అంది నవ్వుతూ

'మరి – పెళ్ళికి నన్ను పిలుస్తారా?' చిన్న పిల్లాడికి మల్లే అడిగాడు అమాయకంగా

'నీ శిష్యురాలు నీకు వెడ్డింగ్ కార్డ్ ఇవ్వకుండా ఉంటుందా? – కొంటెగా అంది– తను

★ ★ ★ ★ ★

నేనొకటడుగుతాను నిజం చెప్తావా?

నేర విచారణ చేసే పోలీసు ఆఫీసర్ మల్లే అడిగింది దివ్య

'దేన్ని గురించి?' కంగారు పడుతూ అడిగింది రమ్య

నువ్వూ – రాఘవగారూ – తరుచు కలుసుకొంటున్నారా?'

క్రాస్ ఎగ్జామిన్ చేసే లాయర్‌కి మల్లే అడిగింది

దీనికి నేను భయపడటం ఏమిటన్నట్టుగా "కలుసుకొంటున్నాం ఏమంటావ్?" అనడిగింది

"నీకు – రాఘవగారు – ఇంతకు ముందు నుంచే తెలుసా?" మళ్ళీ ప్రశ్న వేసింది

దివ్య అడుగుతూన్న పద్ధతి తనకి చాలా చికాకనిపించింది.

నువ్వు బుజ్జి పాడు చేసుకోనంటే చెబుతాను ఆయన నాకెప్పటి నుండో తెలుసు'

మొండిగానే చెప్పింది

ఆయనతో నీ కెప్పటి నుంచి పరిచయమో తెలుసుకోవచ్చా?" బోనులో నిలుచున్న నేరస్థుణ్ణి అడిగినట్టు అడిగింది

తనూ కుండ బద్దలు కొట్టినట్టు చెప్పింది సమాధానం మేమిద్దరం కాలేజీలో చదువు

కొంటున్న రోజుల్లో ప్రేమికులం. పెళ్ళి చేసుకొందా మనుకొన్నాం కూడా. కానీ విధి మాతో ఆటలాడటంతో విడిపోయాం. తిరిగీ మా అదృష్టం కొద్దీ ఇక్కడ కలుసుకొన్నాం".

తన తెగింపు చూసి దివ్య అదిరి పడింది! అయినా బింకంగా "ఆ కథేమిటో నేను తెలుసుకోవచ్చా? అంది.

"నిరభ్యంతరం తెలుసుకోవచ్చు. ఎప్పుడో ఒకప్పుడు నీకు చెప్పక తప్పదు కాబట్టి చెబుతున్నాను." అంటూ తన కథంతా పూసగుచ్చినట్టు చెప్పింది.

అంతా విన్నాక దివ్య అంది "అమ్మా- నేనీ కూతుర్నమ్మా – నీ మూలంగా నా పెళ్ళి ఆగిపోవటం నీకిష్టమా?"

"నీ పెళ్ళి నా మూలంగా ఎందుకాగుతుందమ్మా?" ఉక్రోషంగా అడిగింది తను.

దివ్య కళ్ళల్లో నీళ్ళు పెట్టుకొంది! తన మనస్సు కలచి వేసినట్లయి పోయింది!

"ఎందుకమ్మా – ఏడుస్తున్నావ్?!" అంది దివ్య తల నిమురుతూ.

"అమ్మా – కొంచెం ఆలోచించు. కొద్ది రోజుల్లో నా పెళ్ళి జరగబోతోంది.

అలాంటపుడు నువ్వీవిధంగా ప్రవర్తిస్తే నా పెళ్ళి ఆగిపోదా?–" న్యాయం కోసం అడుగుతున్నట్టుగా అడిగింది.

"నేనేం తప్పుగా ప్రవర్తించ లేదే?" బోనులో నిలబడ్డ ముద్దాయికి మల్లే ఫీలవుతూ అంది తను.

"నువ్వు తప్పు చెయ్యకపోవచ్చు. కానీ ఆయనతో కలిసి నువ్వు కనబడుతూంటే చూసిన వాళ్ళేమను కొంటారు! ఈవిషయం సునీల్‌కి తెలిస్తే నన్నుపెళ్ళి చేసుకొంటాడా?– అనుకొన్న పెళ్ళి ఆగిపోతే మళ్ళీ ఆడపిల్లకి పెళ్ళవుతుందా? నువ్వే చెప్పు." ఇంకా నువ్వు చేస్తున్న తప్పు నీకర్థం గావటం లేదా- అన్నట్టడిగింది.

"నీ పెళ్ళి జరగడం కంటే నాకింకేం కావాలి తల్లీ – నన్నేం చెయ్యమన్నావో చెప్పు".

నేరం వొప్పుకొంటున్న దోషికి మల్లే అంది.

అవకాశం జారవిడుచుకొనే వ్యక్తి కాదు – దివ్య.

తన తల్లి చేతిని తన తల మీద పెట్టుకొని "నా మీద ప్రమాణం చేసి చెప్పమ్మా." అంది.

"ఏమిటమ్మా?! ఏమిటంటున్నావ్?!" కలవర పడుతూ అడిగింది – తను.

"అవునమ్మా– నువ్వే కనుక నీ కూతురి క్షేమం కోరుకొన్న దానివయితే – నా మీద ప్రమాణం చేసి చెప్పు. రాఘవ గారినింకెప్పుడూ కలుసుకోననీ, మాట్లాడననీ, ఆయనతో ఏవిధమైన సంబంధమూ పెట్టుకోనని". అర్థిస్తున్నట్టుగా అడిగింది – దివ్య.

తనూ రాఘవా చాలా కాలం తర్వాత కలుసుకొన్నారు. అతనిప్పుడిప్పుడే మానసిక వ్యథనుంచి కోలుకొంటున్నాడు. దివ్య చెప్పినట్టుగా ప్రమాణం చేస్తే – రాఘవ గతేం కాను? మరో మారు తనకి దూరమైన పక్షంలో అతను బతకగలడా??– అలా అని – అతనితో దిదే లోకమని తను అనుకొంటే – తన కూతురి పెళ్ళి ఆగిపోవటం ఖాయం. తన స్వార్థం కోసం – తన కూతురి జీవితం బలిచేస్తుందా? నలుగురికీ తెలియక ముందే – రాఘవతో తెగతెంపులు చేసుకొంటే – కనీసం కూతురి భవిష్యత్తన్నా బావుంటుంది.

ఏం చెయ్యాలి – తను?

దివ్య తనకేసే ఆతృతగా చూస్తోంది.....

కళ్ళల్లోంచి నీరు కారుతూంటే – దివ్యని దగ్గరకి తీసుకొని వాత్సల్య పూరిత స్వరంతో అంది : "అమ్మా – దివ్యా! నీ మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. ఈ క్షణం నుంచీ రాఘవతో – నాకే విధమైన సంబంధమూ ఉండబోదు. అతన్నెప్పుడూ కలుసుకోను. అతనితో మాటాడను. సరేనా?"–

"మా అమ్మ మనసు వెన్న!" అంటూ ఒక కాంప్లిమెంటిచ్చింది దివ్య. పనిలో పనిగా ఒక ముద్దు కూడా పెట్టుకొంది!

తను రాఘవ గురించే ఆలోచిస్తోంది....

చాలాకాలం తర్వాత దగ్గరయిన తను – మళ్ళీ దూరమయిందని తెలుసుకొన్న రోజున – రాఘవ ఎంతగా కుమిలి పోతాడు?

కిటికీ లోంచి బయటకు చూస్తోంది....

వర్షం కురిసి వెలిసి వుండాలి.

రోడ్డంతా వాన నీటితో నిండి పోయింది!

పిల్లలు నీళ్ళలో కాగితం పడవలు వదులు తున్నారు. ☐

# న్యాయపీఠం

బి.బి.రావు. ఎమ్.ఏ.ఎల్ఎల్.బి.

## బాల నేరస్తులపై విచారణ ఆరు మాసాల్లో పూర్తి అవ్వాలి

పదహారు సంవత్సరాల లోపు వయస్సు వున్న బాల నేరస్తులను అందరిని జైళ్ళ నుంచి విడిచి పెట్టాలని షీలాబార్సీ అను సంఘ సేవకురాలు సుప్రీమ్ కోర్టుకు రిట్ పిటిషన్ పెట్టుకున్నది. జైళ్ళలో ఎంత మంది నేరస్తులు ఉన్నారో వివరాల కోసం ఆమె పిటిషన్ పెట్టింది. సుప్రీమ్ కోర్టు వారు భారత ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలకు నోటీసులు పంపారు. అన్ని రాష్ట్రాలలోని జిల్లా జడ్జీలకు కూడా జైళ్ళను తనిఖీ చేసి ఎంత మంది బాల నేరస్తులు ఉన్నారో, వారు చేసిన నేరాలు పరిశీలించి వారికి తగు న్యాయ సహాయం కలిగించినది, లేనిది వివరాలు తెలియ పర్చమని సుప్రీమ్ కోర్టు వారు 1986 సంవత్సరం ఏప్రిల్ 15వ తేదీన వుత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు నెలలో సుప్రీమ్ కోర్టు వారు జిల్లా జడ్జీలు పంపిన రిపోర్టులు పరిశీలించారు. భారత రాజ్యాంగంలోని 39 (ఎఫ్) ఆర్టికల్ ప్రకారం రాష్ట్రాలు బాలల అభివృద్ధికి కృషి చేయాలని వారి రక్షణకు చర్య తీసుకోవాలని సుప్రీమ్ కోర్టు వారు పేర్కొన్నారు. బాలల చట్టం వున్నప్పటికి బాల నేరస్తులను జైళ్ళలో నిర్బంధిస్తున్నారు. చాలినన్ని రిమాండ్ గృహాలు లేకపోవడం వలన బాల నేరస్తులను జైళ్ళలో వుంచ వలసి వస్తున్నదని రాష్ట్రాల వాదనను సుప్రీమ్ కోర్టు వారు అంగీకరించ లేదు. బాల నేరస్తులను రిమాండ్ గృహాలు లేదా అబ్జర్వేషన్ గృహాలలో మాత్రమే వుంచాలని అవి చాలినన్ని లేనపుడు బాల నేరస్తులను బెయిలుపై విడిచి పెట్టాలని సుప్రీమ్ కోర్టు వారు ఆదేశాలను జారీ చేశారు. బాల నేరస్తుల కొరకు ప్రత్యేకమైన జువనైల్ (బాలల) కోర్టులు ఏర్పాటు చేసి ఆ కోర్టులలో ఈ విధమైన కేసులలో శిక్షణ పొందిన వారిని మాత్రమే మేజిస్ట్రేట్‌లుగా నియమించాలని సుప్రీమ్ కోర్టు వారు ఆదేశాలు జారీ చేశారు. 16 సంవత్సరాల లోపల వయస్సు ఉన్న బాలలపై కంప్లయింటు ఇచ్చినట్లయితే ఆ నేరం ప్రకారం ఏడు సంవత్సరాలు దాటకుండా కారాగార శిక్ష విధించ వలసి వచ్చినప్పుడు మూడు మాసాలలో పరిశోధన పూర్తి చెయ్యాలి. లేనిచో ఆ కేసును ముగించి వెయ్యాలి. మూడు మాసాలలో ఛార్జిషీటు పెట్టి నట్లయితే ఈ కేసును ఆరు మాసాలలో విచారణ చేసి కేసు పరిష్కారం చెయ్యాలి. లేనట్లయితే ఆ కేసును కొట్టి వెయ్యాలని 1986 ఆగస్టు 13వ తేదీన సుప్రీమ్ కోర్టు వారు ఆదేశాలు జారీ చేశారు. ☐